మోదీ సభకు నిరసన సెగ

- మద్దిలపాలెం జంక్షన్‌లో హోరెత్తిన ఆగ్రహ జ్వాలలు
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రకటన చేయాలని నినాదాలు
- సీపీఎం, సీపీఐ కార్యకర్తల అరెస్ట్
- అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు
- సీపీఎం, సీపీఐ, ఏపీఎఫ్‌టీయూల ఖండన


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు


ఏఐటీయూసీ నేతను అరెస్ట్ చేస్తున్న పోలీసులు


కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు


ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సీపీఎం నాయకులు

విశాఖ విద్య/మద్దిలపాలెం/ఆరిలోవ: మద్దిలపాలెం జంక్షన్.. బుధవారం నిరసన జ్వాలలతో హోరెత్తింది. ప్రధాని మోదీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ వేర్వేరుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణపై స్పష్టమైన ప్రకటన చేయాలని వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, ఎస్ఎఫ్ఐ నినదించగా, ఆంధ్రాకు అన్యాయం చేసిన మోదీ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నల్ల జెండాలు, ఫ్లెక్సీలతో ఆందోళన చేశాయి. మంగళవారం రాత్రి నుంచి విశాఖ, అనకాపల్లి జిల్లాల వ్యాప్తంగా సీపీఎం, సీపీఐ నాయకులను పోలీసులు గృహ నిర్బంధాలు చేశారు. మోదీ సభ నేపథ్యంలో ముందస్తు అరెస్టులు చేసినా.. పక్కా వ్యూహంతో ఆందోళనకారులు మద్దిలపాలెం జంక్షన్‌కు తరలివచ్చి తమ నిరసన గళాన్ని వినిపించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో.. పోలీసులు వారిని నిలువరించారు. తీవ్ర పెనుగులాట జరగడంతో పలువురు ఆందోళనకారులు కిందపడిపోయారు. అయినప్పటికీ పోలీసులు వారిని లాక్కెళ్లి వాహనాల్లోకి ఎక్కించారు. ఎంవీపీ, ఆరిలోవ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఉత్తరాంధ్రకు ఏం చేశారని రోడ్‌షో?

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీ యూసీ, సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాలు నిరసనలు చేపట్టాయి. మద్దిలపాలెం జంక్షన్‌లో నిరసనలకు సిద్ధమవుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి, ఎంవీపీపోలీస్ స్టేషన్ తరలించారు. అలాగే ఎంఎంటీసీ కాలనీలో ఉన్న సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పడాల గోవింద, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అడ్డూరి శంకర్‌రావును ముందస్తుగా అరెస్టు చేసి ఎంవీపీ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ మోదీ ఉత్తరాంధ్రకు ఏం అభివృద్ధి చేశారని రోడ్ షో, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ.. కేంద్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే కుట్రలు చేసి.. ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారన్నారు. 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో పాటు సీపీఎం నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్, బొట్టా ఈశ్వరమ్మ, పి.మణి, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, డి.అప్పలరాజు, సీపీఐ నాయకులు ఎ.విమల, కె.సత్యనారాయణ, రెహ్మాన్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, పి.మన్మథరావు, పి.గోవింద్, ఏపీఎఫ్‌టీయూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే కార్మిక సంఘాల నాయకులు కె.ఈశ్వరరావు కె.శివ, పిల్లా రమణ. సిహెచ్ సూరిబాబు, కొండబాబు, ఎం.శివలను అరెస్ట్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.కృష్ణారావు, సభ్యులు సుబ్బారావు, పైడిరాజు, నాయుడు, కుమార్ తదితర 13 మందిని హనుమంతవాక వద్ద గల ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మోదీ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నిరసన

ఆంధ్రాకు అన్యాయం చేశారని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కాంగ్రెస్ తూర్పు ఇన్‌చార్జి ప్రియాంక దండి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఏయూ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. నల్ల జెండాలు, ప్లకార్డులతో మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, మహిళా ప్రతినిధి కాండవ గాయత్రి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి పినమాల శివ కుమార్, విశాఖ అధ్యక్షుడు అల్లిపిల్లి సతీష్ కుమార్, డాక్టర్ పూడి కిరణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, ఎంవీపీ స్టేషన్‌కు తరలించారు.

మోదీకి దాసోహం సిగ్గు చేటు

మోదీకి దాసోహం అయ్యి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కూటమి ప్రభుత్వం తీవ్రద్రోహం తలపెట్టిందని సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఆగ్ర హం వ్యక్తం చేశారు. మిట్టల్‌కు దొడ్డిదారిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కట్టబెట్టాలని కుట్ర చేస్తున్నారని, వెంటనే ఈ దుర్మార్గాన్ని ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించా రు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రధాని తన వైఖరి స్పష్టం చేయకపోవడం దారుణమన్నారు.

కఠిన నిబంధనలతో మహిళల ఇక్కట్లు


పాస్ చూపించాలని అడుగుతున్న పోలీసు అధికారి


సభా స్థలికి బ్యాగులు అనుమతించకపోవడంతో స్టాపర్‌కు వేలాడదీసిన మహిళలు


సాయంత్రం 4.30కు ఖాళీగా దర్శనమిస్తున్న పలు కంపార్ట్‌మెంట్‌లు

ఏయూక్యాంపస్/సీతంపేట/డాబాగార్డెన్స్/ఎంవీపీకాలనీ/విశాఖ విద్య

సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం ఒంటి గంట నుంచే ప్రజలను సభాస్థలికి తీసుకురావడం కనిపించింది.
- పోలీసుల కఠినమైన ఆంక్షల వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచి నీళ్ల సీసాలు, భోజనం ప్యాకెట్లను కూడా సభాస్థలిలోకి అనుమతించలేదు.
- భోజనం పూర్తయిన తర్వాతనే బారికేడ్లలోకి రావాలని చెప్పడంతో చాలామంది అక్కడే మంచినీళ్ల సీసాలు వదిలి వెళ్లారు. మరికొందరు అక్కడి నుంచి వెనుదిరిగారు. వారిని ఆపేందుకు కూటమి పార్టీల నేతలు నానాతంటాలు పడ్డారు.
- సభకు వచ్చిన వారిలో ఎక్కువ మంది మహిళలే ఉండగా.. వారికి తగినన్ని మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడ్డారు.
- సభకు వచ్చిన మహిళలు వెంటనే వెనుదిరగడం చూసిన టీడీపీ, జనసేన కార్యకర్తలు వారిని ఆపే ప్రయత్నం చేశారు. కొందరు ఎమ్మెల్యేలు స్వయంగా రోడ్డుపై నిల్చుని ప్రజలను రోడ్‌షో, బహిరంగ సభ వేదిక వైపు పంపించారు.
- భోజనం నాణ్యత అంతంతమాత్రంగానే ఉండటంతో చాలామంది సగం తిని వదిలేశారు. ఉప్మా బాగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.
- మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఏయూ మెయిన్ గేట్‌కు తాళాలు వేశారు. రోడ్‌షోకు ప్రజలు వచ్చే సమయంలో మాత్రమే ఏయూ మెయిన్ గేట్‌ను తెరిచారు.
- రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఫుడ్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. వీటిని రేషన్ వాహనాల ద్వారా సభాస్థలికి తరలించి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ వాహనాలను వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.
- బహిరంగ సభకు శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పాతపట్నం, టెక్కలి, తాళ్లవలస, నందిగామ, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జనాల్లో చాలా మంది సాగరతీరానికి క్యూ కట్టారు. మోదీ సభకు వచ్చి బీచ్‌లో ఎంజాయ్ చేశారు.
- మరికొంత మంది జగదాంబ జంక్షన్‌కు వెళ్లి.. ఎంచక్కా పండగ షాపింగ్ చేసుకున్నారు.
- ప్రధాని రోడ్ షోకు 60 వేల మంది ప్రజలను తరలిస్తున్నట్లు కూటమి వర్గాలు వెల్లడించినప్పటికీ.. ఆ స్థాయిలో ప్రజలు రాలేదు. రోడ్ షోకు తరలివచ్చిన ప్రజల కోసం ప్రత్యేక కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేశారు. విశాఖ ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల నుంచి ప్రజలను ఇక్కడికి తరలించారు. అయితే సాయంత్రం 4.30 గంటల వరకు పలు కంపార్ట్‌మెంట్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి.
- ఉత్తర నియోజకవర్గం నుంచి ఆశించిన స్థాయిలో జనం రాకపోవడంతో వారికి కేటాయించిన 32, 33, 34 కంపార్ట్‌మెంట్‌లు వెలవెల బోయాయి. దీంతో పలువురు నేతలు అక్కడికి వచ్చి ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.
- పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాల వేదికలను ఏర్పాటు చేశారు. కూచిపూడి, భరతనాట్యం, థింసా వంటి సంప్రదాయ నృత్యాలు చేస్తూ కళాకారులు అలరించారు. వెంకటాద్రి వంటిల్లు దరి ఏర్పాటు చేసిన వేదికపై నృత్యకారిణులు వందేమాతరం గీతానికి నృత్య ప్రదర్శన చేస్తూ ప్రధానికి స్వాగతం పలికారు.
- ఏయూ గ్రౌండ్‌లోని సభా ప్రాంగణం వద్దకు వెళ్లేందుకు మద్దిలపాలెం వైపు గేటు నుంచి కేవలం వీఐపీలను మాత్రమే అనుమతించారు. ఈ దారిలో వీఐపీలను మాత్రమే అనుమతిస్తారని తెలియని సామాన్య ప్రజానీకం సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో చాలా మంది మద్దిలపాలెం జంక్షన్‌లోనే పడిగాపులు కాశారు.


మద్యం షాపు వద్ద టీడీపీ కార్యకర్తలు


లోపలకు అనుమతించకపోవడంతో మద్దిలపాలెం వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు


అంబేడ్కర్ భవన్ నుంచి వాటర్ బాటిల్స్ తీసుకెళ్తున్న రేషన్ వాహనాలు

విమ్స్‌లో రక్తదాన శిబిరం నేడు

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఈ నెల 9న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఇటీవల అందుబాటులోకి వచ్చిన బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వల కోసం 100 యూనిట్లు రక్తాన్ని సేకరించాలని పేర్కొన్నారు. దీని కోసం గురువారం ఉదయం 10 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

కష్టపడి తరలించినా..

- ప్రధాని సభకు వెళ్లకుండానే వెనుదిరిగిన జనం
- ఆరిలోవ, ముడసర్లోవలోనే ఆగిపోయిన బస్‌లు



ముడసర్లోవ వెనుక రోడ్లలో నిలిపిన బస్‌లు, అక్కడే ఆగిపోయిన జనం

ఆరిలోవ: ప్రధాని సభకు వెళ్లకుండానే జనం వెనుదిరిగారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు వివిధ జిల్లాల నుంచి కూటమి పార్టీల నాయకులు జనాలను తరలించారు. అనకాపల్లి, నర్సీపట్నం, సబ్బవరం తదితర ప్రాంతాల నుంచి పాఠశాల బస్‌లు, ఆర్టీసీ బస్‌లలో జనాలను విశాఖ సభకు తీసుకువచ్చారు. సగానికి పైగా బస్‌లతో జనం ఆరిలోవ, ముడసర్లోవ ప్రాంతాలలో ఆగిపోయారు. ఆయా బస్‌లు ఈ ప్రాంతానికి చేరేసరికే సాయంత్రం నాలుగు గంటలు దాటింది. దీంతో ఇంకేం వెళ్తామని జనం బస్‌ల డ్రైవర్లకు చెప్పడంతో అక్కడే ఆగిపోయారు. ఆ ప్రాంతంలో విపరీతమైన చలి కావడంతో సాయంత్రం 5.30 గంటలకు తిరుగుముఖం పట్టారు.

డ్వాక్రా గ్రూపుల నుంచి తొలగిస్తామంటూ..

ఆరిలోవ ప్రాంతంలో స్వచ్ఛందంగా సభకు వెళ్లడానికి విముఖత వ్యక్తం చేయడంతో కూటమి నాయకులు డ్వాక్రా మహిళలను బలవంతంగా సభకు బయల్దేరదీశారు. సభకు రానివారిని డ్వాక్రా గ్రూపుల నుంచి తొలగిస్తామని హెచ్చరించడంతో గత్యంతరం లేక కొందరు అయిష్టంగా బయల్దేరాల్సి వచ్చింది. మిగిలిన వారిని మనిషికి రూ.300, మజ్జిగ ప్యాకెట్, బిస్కెట్ ప్యాకెట్ ఇచ్చి తరలించారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫేర్‌కు గురుకులం విద్యార్థి


అధికారుల నుంచి జ్ఞాపిక అందుకుంటున్న ఆకాష్, గణిత ఉపాధ్యాయుడు లక్ష్మణరావు

ఆరిలోవ: సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శనకు శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం విద్యార్థి పొన్నకాయల ఆకాష్ రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైంది. ఈ నెల 7, 8 తేదీలలో విజయవాడలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ప్రదర్శనలో గణిత ఉపాధ్యాయుడు ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆకాష్ రూపొందించిన 'యూజ్ ఆఫ్ మ్యాథమెటికల్ మోడలింగ్ ఇన్ స్వచ్ఛభారత్' ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో బహుమతి కైవసం చేసుకుంది. దీంతో పాండిచ్చేరిలో ఈ నెలలో జరగనున్న సౌత్ ఇండియా పోటీలకు ఆకాష్ అర్హత సాధించినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకుడు బి.కె.రమేష్, ఉపాధ్యాయులు ఆకాష్‌కు అభినందనలు తెలిపారు. విశాఖ, అనకాపల్లి ఉమ్మడి జిల్లాల గురుకులాల సమన్వయకర్త సంభాన రూపవతి ప్రిన్సిపాల్‌ను, గైడ్ టీచర్‌ను, గణేష్‌ను అభినందించారు.

ఏయూ సెర్చ్ కమిటీ ఏర్పాటు

- వైస్ ఛాన్సలర్ ఎంపికకు కసరత్తు మరూ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్(వీసీ) నియామక ప్రక్రియలో మరో ముందడుగు పడింది. యూనివర్సిటీకి ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నుంచి గౌహతి ఎన్ఐపీఈఆర్ డైరెక్టర్ ఆచార్య యూఎస్ఎన్ మూర్తి, ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తరఫున ముంబయిలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ ఆచార్య ఎస్.మహేంద్రదేవ్, యూజీసీ నుంచి కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య భట్టు సత్యనారాయణను నియమించారు. ఏయూ వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు వందకు పైగా అభ్యర్థుల్లో ముగ్గురి పేర్లను సెర్చ్ కమిటీ ఎంపిక చేయనుంది. వర్సిటీ ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావుతో పాటు, పలువురు ఆచార్యులు సైతం దరఖాస్తు చేశారు. సెర్చ్ కమిటీ ముగ్గురు పేర్లను ఖరారు చేసి, గవర్నర్ ఆమోదానికి పంపిస్తారు. గవర్నర్ ఆమోదం మేరకు ప్రభుత్వం వీసీ పేరును ప్రకటించనుంది. నిబంధనలు ఎలా ఉన్నా.. ప్రభుత్వం ఆశీస్సులున్న వారికే వీసీ పోస్టు దక్కుతుందనేది జగమెరిగిన సత్యం. దీంతో ఆశావహులంతా లాబీయింగ్ కోసం కూటమి పెద్దల్ని ప్రసన్నం చేసుకునే పనిలో తలమునకలై ఉన్నారు.



సుందర సాగరతీరం.. పచ్చని కైలాసగిరి.. ఎందరో మేధావులను తీర్చిదిద్దిన సరస్వతీ నిలయం ఆంధ్రా యూనివర్సిటీ.. మరెన్నో ప్రముఖ విద్యాలయాలు, కార్యాలయాలు... ఆసియాలోనే అతి పెద్దదైన ఎంవీపీ కాలనీ... ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రులతో కూడిన హెల్త్ సిటీ, విమ్స్... వీటన్నింటి సమాహారమే విశాఖ తూర్పు నియోజకవర్గం. ఒకప్పుడు జీవీఎంసీలో ఒక వార్డు పరిధిలోని చిన్నప్రాంతం... దినదినాభివృద్ధి చెందిన ప్రస్తుతం నగరంలోనే కీలక నియోజకవర్గంగా మారింది. – ఆరిలోవ

విద్యా సౌరభం పర్యాటక సోయగం



అద్భుత ప్రగతి విశాఖ తూర్పు నియోజకవర్గం సొంతం


కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాలు

నగరంలో విశాఖ తూర్పు నియోజకవర్గం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. రాజకీయ రంగం, పర్యాటకం, విద్యాలయాలకు పుట్టినిల్లుగా మారింది. వందల సంఖ్యలో అక్కడక్కడా ఉండే నివాసాలు ఇప్పుడు వేల సంఖ్యలో పెరిగిపోయాయి. గతంలో ఎక్కువ మంది పేదలు తలదాచుకునే నివాసాలు ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, కోట్లకు పడగలెత్తే రాజకీయ నాయకుల భవంతులు వెలిశాయి. అనారోగ్యానికి గురైతే పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీహెచ్‌కో, జిల్లా పరిషత్ వద్ద ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకో వెళ్లే ప్రజలకు ఇప్పుడు హెల్త్‌సిటీలో కార్పొరేట్ ఆస్పత్రులు, విమ్స్ అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు విశాలమైన బీఆర్‌టీఎస్ రోడ్లు, విస్తరించిన బీచ్ రోడ్డు, విదేశీ పర్యాటలకును ఆకర్షించే పర్యాటక ప్రాంతాలు, కిలోమీటర్ల కొలది ఉన్న సముద్ర తీరం ఈ నియోజకవర్గం సొంతం. ఒకప్పుడు జీవీఎంసీలో 23వ వార్డుగా ఉండే ప్రాంతం ఇప్పుడు తూర్పు నియోజకవర్గంగా ఎదిగింది. ఆరిలోవ, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, లాసన్స్‌బే కాలనీ, ఇసుకతోట, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, జాలరిపేట, అప్పూఘర్, పెదవాల్తేరు ఈ వార్డులో ఉండేవి. ఆయా కాలనీలు అన్నింటిలోనూ కలిపి సుమారు 15 వేల నివాసాలు, 40 వేల మంది జనాభా ఉండేవారు. ఇప్పుడు అదే ప్రాంతం లక్షకు పైగా నివాసాలు, సుమారు 6 లక్షలు జనాభాతో నిండిపోయింది. దీంతో 2009 నుంచి ఒక నియోజకవర్గంగా మారిపోయింది. ఇక్కడ కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి వచ్చిన వారిలో ఎక్కువ మంది వ్యాపారవేత్తలు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వలస వచ్చిన వారిలో కూలీలు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఉన్నారు. ధనిక కాలనీగా పేరుపొందిన ఎంవీపీకాలనీలో ఎక్కువగా వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు ఉండగా ఇసుకతోట, వెంకోజీపాలెం, ఆరిలోవ ప్రాంతాల్లో ఎక్కువ మంది కూలీలు, చిరు వ్యాపారులు, చిరుద్యోగులు నివసిస్తున్నారు.


రాత్రి సమయంలో ఎంవీపీ కాలనీ

ఆసియాలోనే అతి పెద్ద కాలనీ

నియోజకవర్గంలో ముచ్చలవానిపాలెం కాలనీ (ఎంవీపీ కాలనీ) ఆసియాలోనే 12 సెక్టార్లతో అతి పెద్ద కాలనీగా పేరుపొందింది. ఇక్కడ విశాలమైన రోడ్లు, పార్కులు, భవంతులు ఉన్నాయి. ఎక్కువ మంది ధనికులు, ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు నివసించే ఈ ప్రాంతంలో శ్రీసత్యసాయి, లిటిల్ ఏంజెల్స్, నారాయణ టెక్నో, అల్వార్ దాస్, రవీంద్ర భారతి, శ్రీచైతన్య తదితర పెద్ద ప్రైవేట్ విద్యాలయాలు, కళాశాలలు, బంగారం షాపులు, రియల్ ఎస్టేట్ కార్యాలయాలతోపాటు విలాసవంతమైన గాదిరాజు ప్యాలస్, టీటీడీ కల్యాణ మండపం ఉన్నాయి. నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు కోకొల్లలుగా ఉన్నాయి. తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలు జీవీఎంసీ హైస్కూళ్లు, ఏయూ హైస్కూళ్లు ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల పేద విద్యార్థులకు అందుబాటులో ఉంది. వందలకొద్దీ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. అందుకే ఇది అన్ని రకాల వ్యాపారాల కేంద్రంగా మారింది.

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల నిర్వహణ

నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపారాల కార్యాలయాలు అధికంగా ఉన్నాయి. ఎంవీపీ కాలనీలో టీటీడీ కార్యాలయం, డీఆర్‌డీఏ, టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, సీబీఐ కార్యాలయం, విశాలాక్షినగర్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయం, ఎక్సైజ్ విభాగం జిల్లా కార్యాలయం, ఆరిలోవ ప్రాంతంలో జిల్లా పశు సంవర్ధక శాఖ, జిల్లా వాణిజ్య శాఖ, విశాఖ కేంద్ర కారాగారం, సీఐడీ జోనల్ కార్యాలయం, జిల్లా మహిళా కేంద్రం, ఏసీబీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వాటితోపాటు ఎంవీపీ కాలనీ ప్రాంతంలో క్రెడాయ్, నెరెడ్కో తదితర రియల్ ఎస్టేట్ కార్యాలయాలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో నిత్యం జన సంచారం, వ్యాపార లావాదేవీలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

హెల్త్‌సిటీ, విమ్స్‌తో వైద్య సేవలు

నియోజకవర్గంలోని ఆరిలోవ ప్రాంతంలో సుమారు 200 ఎకరాల్లో హెల్త్‌సిటీ ఉంది. అపోలో, కేర్, క్యూ – 1, పినాకిల్, మెడికవర్, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ తదితర 17 కార్పొరేట్ ఆస్పత్రులు వైద్య సేవలు అందిస్తున్నాయి. మరో 5 ఆస్పత్రులు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిలో ఆధునిక వైద్యం అందుబాటులో ఉండడంతో నగరంతోపాటు ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. ఇక్కడ 100 ఎకరాల్లో నిర్మించిన విమ్స్‌లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ల్యాడ్జిలు, భోజనం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు సంఖ్య పెరిగి వాటి నిర్వాహకులకు కాసులు కురిపిస్తున్నాయి.

పర్యాటకానికి కీలక కేంద్రం..

నియోజకవర్గంలో విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించే పర్యాటక కేంద్రాలున్నాయి. ఇక్కడ ఆర్‌కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం వరకు సుమారు 10 కిలోమీటర్ల పొడవున తీర ప్రాంతం ఉంది. ఇందులో ఆర్‌కే బీచ్, వుడా పార్కు, తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం బీచ్, వైఎస్సార్ సీ వ్యూ (సీతకొండ బీచ్), కైలాసగిరి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటితోపాటు శివాజీ పార్కు, ముడసర్లోవ పార్కు సందర్శకులకు చేరువలో ఉన్నాయి. జీవీఎంసీ గత ఏడాదిలో ముడసర్లోవ ప్రాంతంలో పిల్లల పార్కు నిర్మాణం చేపట్టింది. ఆ పనులు జరుగుతున్నాయి.





శ్రీరామానుజ కాలేజ్‌లో ఉత్తమ విద్యాబోధన


శ్రీరామానుజ జూనియర్ కాలేజ్

ఆరిలోవ : నగరంలోని విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధి పెదవాల్తేరు ప్రాంతం డాక్టర్స్ కాలనీలో ఉన్న శ్రీ రామానుజ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నారు. ఈ కళాశాల విద్యా రంగంలో నగరంలో ప్రథమ శ్రేణి సంస్థగా నిలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తోంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ కళాశాల అమెరికాలోని కెంటకీలో నిర్వహిస్తున్న బ్లూగ్రాస్ కమ్యూనిటీ అండ్ టెక్నికల్ కాలేజ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అప్పటి నుంచి విద్యార్థులు అమెరికా వెళ్లి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను తక్కువ ఖర్చుతో అభ్యసించడానికి అవకాశం కలుగుతోంది. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా, పోటీ పరీక్షలకు సమర్థంగా సిద్ధం చేసేలా బోధిస్తున్నారు. విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో పట్టుదలతో చదువుకుని అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది కళాశాలలో 18 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకాగా 11 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. 110 మంది ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయగా 13 మంది ఉత్తమ ర్యాంకులు సాధించి దేశంలోని ప్రముఖ సంస్థల్లో ప్రవేశాలు పొందారు. దీంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధన వల్లే ఇది సాధ్యమవుతోందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నామని, కఠినమైన అంశాలను సులభతరం చేస్తున్నామని అధ్యాపకులు అంటున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విద్యార్థుల పట్టుదల వల్లే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శివ రామ దత్తాత్రేయ తెలిపారు.

జేఎస్ఆర్ సిల్క్స్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ



సీతంపేట : జగదాంబ థియేటర్ కాంప్లెక్స్‌లో గల జేఎస్ఆర్ షాపింగ్‌మాల్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ లభిస్తోంది. సంక్రాంతి పండగ సందర్భంగా అన్ని వస్త్రాలపై 50 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తోంది. మెగా సేల్‌లో భాగంగా ఆధునిక, సంప్రదాయ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్యాన్సీ, డిజైనర్, సిల్క్, బెనారస్ చీరలు, చుడీదార్స్, డ్రెస్ మెటీరియల్, కుర్తీస్, లెహంగాస్, గాగ్రాస్, కిడ్స్, వెస్టర్న్ వేర్ దుస్తులు షోరూంలో ఆకట్టుకుంటున్నాయి. కుర్తీస్ రూ.99ల నుంచి మొదలు కానుండగా, చీరలు రూ.149 నుంచి ధరల్లో లభిస్తున్నాయి. వెస్టర్న్ వేర్ రూ.249, 4 దుప్పటాస్ రూ. 299, 4 సిల్క్ శారీస్ రూ.599, 4 కాటన్‌శారీస్ రూ. 599ల నుంచి లభిస్తాయని షోరూం ప్రొప్రైటర్ వేగి జగదీష్‌కుమార్ తెలిపారు.

క్యాన్సర్ నివారణ సాధ్యమే..

[illegible]

జీవనశైలి మార్పుల వల్లే క్యాన్సర్



మహారాణిపేట : జీవన శైలిలో వచ్చిన మార్పులు వల్లే క్యాన్సర్ విజృంభిస్తోంది. కాలుష్య ప్రభావం, అలవాట్లు, వ్యసనాలు, జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం వల్ల రోజురోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి పరంగా దొరికే ఆహారం లేకపోవడం, అర్బన్‌లో ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతుండడంతో పురుషులు, స్త్రీలు అన్న తేడా లేకుండా అందరూ క్యాన్సర్‌కు గురవుతున్నారు. స్త్రీలలో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు పురుషులు కన్నా ఎక్కువగా ఉన్నారు. తగినంత వ్యాయమం లేకపోవడం, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్ వినియోగం వల్ల లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాయమం చేయడం, ఉబకాయాన్ని నివారించడం, జీవన శైలి మార్పులు ద్వారా క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చు. భారత ప్రభుత్వ పథకం అయుస్మాన్ భారత్, రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకంతో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారందరికీ క్యాన్సర్ సంరక్షణను అందిస్తున్నారు. లంగ్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్‌ను నయం చేయవచ్చు. తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారించవచ్చు. క్యాన్సర్ సోకిందని భయపడాల్సిన అవసరం లేదు. సకాలంలో గుర్తించి మందులు వాడి ఎంతో మంది క్యాన్సర్‌ను జయించారు.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్, మేనేజింగ్ డైరెక్టర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి

పక్షులను, పర్యావరణాన్ని కాపాడుదాం

పక్షులను కాపాడి పర్యావరణ సమతుల్యానికి బాటలు వేద్దాం. ఈ మేరకు సత్వా నేచురల్స్ స్టోర్‌కు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తున్నాం. సెల్‌ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల పక్షుల మనుగడకు ముప్పు ఏర్పడింది. అలాగే క్రిమి సంహారక మందులతో పంటలు పండించడంతో ఆ ఆహార గింజలు తిని చిన్నచిన్న కీటకాలు, పక్షులు మృత్యువాత పడుతున్నాయి. నగరీకరణలో భాగంగా చెట్లు నరికి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడంతో పక్షుల గూళ్లు కట్టుకునే నివాస పరిస్థితులు తగ్గిపోయాయి. పక్షులు తమ జీవనాన్ని కొనసాగించే వాతావరణాన్ని కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. పక్షులకు ఆహారం, నీరు అందించి, ఇంటి ఆవరణలో వరి కంకులు, గూళ్లు అమర్చి పక్షులకు నివాసాన్ని కల్పించాలి. అంతరించిపోతున్న పిచ్చుకలు, పావురాలు, రామ చిలుకలు ఇతర పక్షులను కాపాడుకునేలా సత్వా నేచురల్స్ కృషి చేస్తోంది. రైతుల నుంచి వరి కంకులు సేకరించి అదే ధరకు తమ స్టోర్‌కు వచ్చే కస్టమర్లకు అందించి ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాం.

– వి.లక్ష్మీ తేజ, సత్వా నేచురల్స్, సీతమ్మధార.



















